# రెండు నెలల్లో టెస్లా విక్రయాలు!


- గరిష్ఠ ధర రూ.2 కోట్లకు పైమాటే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: అమెరికాకు చెందిన ఈవీల సంస్థ టెస్లా భారత్‌లో అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. వచ్చే రెండు నెలల్లో తన తొలి షోరూంను ముంబైలో లేదా న్యూఢిల్లీలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌తోపాటు న్యూఢిల్లీలోని ఏరోసిటీలో అవుట్‌లెట్‌ను తెరిచేయోచనలో సంస్థ ఉన్నది. 2022లో భారత్‌లో అడుగుపెట్టాలని చూసిన సంస్థ..భారత ప్రభుత్వం విధిస్తున్న సుంకాలపై బహిరంగంగానే విమర్శలు గుప్పించి వెనక్కితగ్గింది. మళ్లీ ఇప్పుడు ఇక్కడి మార్కెట్లో అడుగుపెట్టడానికి రెడీ అయింది. కంపెనీ ఎన్ని మాడళ్లు, ధర ఎంత అనేదానిపై స్పష్టం చేయకపోయినప్పటికీ.. అమెరికాలో ఆయా మాడళ్ల ధర ఆధారంగా ఇక్కడి ధరలను నిర్ణయించే అవకాశం ఉన్నది. ప్రారంభ ధర రూ.21 లక్షలు(25 వేల డాలర్లు) స్థాయిలో ఉంటుందని అంచనా. దీంతోపాటు టెస్లా సైబర్‌ట్రక్ రూ.50.70 లక్షలు, మాడల్ 2 రూ.45 లక్షలు, మాడల్ 3 రూ.60 లక్షలు, మాడల్ వై రూ.70 లక్షలు, మాడల్ ఎస్ రూ.1.50 కోట్లు, మాడల్ ఎక్స్ రూ.2 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా.

# తీవ్ర ఊగిసలాటలో సూచీలు

ముంబై, ఫిబ్రవరి 19: దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు భారీగా నష్టపోవడంతో ఒక దశలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్ చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలే ఇందుకు కారణం. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 28.21 పాయింట్లు నష్టపోయి 75,939.18 వద్దకు చేరుకోగా, నిఫ్టీ 12.40 పాయింట్లు కోల్పోయి 22,932.90 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లను విధించనున్నట్లు మరోసారి స్పష్టంచేయడంతో దేశీయ ఐటీ షేర్లు కుప్పకూలాయి.



ముఖ్యంగా టీసీఎస్, ఇన్ఫోసిస్ షేరు 2 శాతానికి పైగా నష్టపోయింది. దీంతోపాటు హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. కానీ, జొమాటో షేరు 5 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. అలాగే ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ 1.33 శాతం, టెక్నాలజీ 1.31 శాతం పతనం చెందగా..ఇండస్ట్రియల్స్ 2.59 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.19 శాతం, మెటల్ 1.41 శాతం, సర్వీసెస్ 1.41 శాతం, కమోడిటీస్ సూచీలు లాభపడ్డాయి.

# సైయెంట్ సీఈవోగా సుకమల్ బెనర్జీ



హైదరాబాద్, ఫిబ్రవరి 19: హైదరాబాద్ కేంద్రస్థానంగా ఐటీ కార్యకలాపాలు అందిస్తున్న సైయెంట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సుకమల్ బెనర్జీ నియమితులయ్యారు. ఈ నియామకం బుధవారం నుంచి అమలులోకి వచ్చినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఐదేండ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. మెకానికల్ ఇంజినీరింగ్, ఎంబీఏ ఫైనాన్స్ చేసిన ఆయనకు టెక్నాలజీ విభాగంలో మంచి పట్టున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.1,926.4 కోట్ల ఆదాయంపై రూ.122.3 కోట్ల నికర లాభాన్ని గడించింది.



# బీమా-ఏఎస్‌బీఏ

## ప్రీమియం చెల్లింపుల కోసం పాలసీదారులకు సరికొత్త సదుపాయం


### పరిచయం చేసిన ఐఆర్డీఏఐ-వచ్చే నెల 1 నుంచి అందుబాటులోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ.. పాలసీదారుల కోసం బీమా-ఏఎస్‌బీఏ (అప్లికేషన్స్ సపోర్టెడ్ బై బ్లాక్డ్ అమౌంట్) పేరిట ఓ సరికొత్త ప్రీమియంల చెల్లింపు విధానాన్ని పరిచయం చేసింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ప్రీమియం చెల్లింపు కోసం పాలసీదారులు తమ బ్యాంక్ ఖాతాల్లో సరిపడా నిధులను నిలుపుదల చేయడానికి ఇది దోహదపడుతుందని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్డీఏఐ) తెలిపింది. జీవిత, ఆరోగ్య బీమా కోసం ప్రీమియం చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడమే దీని ఉద్దేశమని పేర్కొన్నది. కాగా, మార్చి 1 నుంచి బీమా-ఏఎస్‌బీఏ సౌకర్యం అందుబాటులోకి రానున్నది. దీన్ని అమలు చేయాలని బీమా సంస్థలకు ఐఆర్డీఏఐ తాజాగా స్పష్టం చేసింది. నిజానికి ఏఎస్‌బీఏ లేదా యూపీఐ ద్వారా ఖాతాల్లో నగదు నిలుపుదల సదుపాయాన్ని స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్లు ఎప్పట్నుంచో విరివిగా వాడుతున్నారు.

**ఇదీ సంగతి..**

జీవిత బీమా లేదా ఆరోగ్య బీమా తీసుకోవాలనుకునేవారికి పాలసీ ఆమోద సమయంలో నగదు సమస్య రాకుండా, ప్రీమియం చెల్లింపులు ఆగిపోకుండా ఉండేందుకు ఈ బీమా-ఏఎస్‌బీఏ సౌకర్యం కలిసిరానున్నది. మనలో చాలామంది బీమా పాలసీలను కొనాలని నిర్ణయించుకొని, ఆ ప్రక్రియ మొదలుపెట్టాక.. మధ్యలో నగదు లేక వెనకడుగు వేస్తూంటారు. ఇలాంటివారు బీమా-ఏఎస్‌బీఏను ఎంచుకొంటే తప్పక బీమా రక్షణను పొందగలరని ఐఆర్డీఏఐ ఆశిస్తున్నది. దేశ ప్రజలందరికీ బీమా రక్షణ లభించాలన్న లక్ష్యంలో భాగంగానే దీన్ని తెచ్చారు. ఇక పాలసీదారుల బ్యాంక్ ఖాతాలో ఒకసారి బీమా ప్రీమియంకు సంబంధించిన నగదు ఆగితే.. పాలసీ జారీ అయ్యాకే సదరు బీమా సంస్థకు ఆ సొమ్ము బదిలీ అవుతుంది. కాబట్టి పాలసీదారుల నగదుకు పూర్తి భద్రత ఉన్నట్టే. యూపీఐ ద్వారా వన్-టైమ్ మ్యాండేట్ (ఓటీఎం) సహాయంతో తమ బ్యాంక్ ఖాతాల్లో కస్టమర్లు నిర్దిష్ట నగదును నిలుపుదల చేయవచ్చు. ఒకవేళ బీమా పాలసీ ప్రతిపాదన తిరస్కరణకు గురైతే ఈ నగదు తిరిగి ఖాతాదారునికి అందుబాటులోకి రాగలదు. అయితే అప్పటిదాకా ఆ సొమ్మును ఖాతాదారులు కూడా వాడుకోలేరు.

## ఎలా పనిచేస్తుంది?




- బీమా కోసం దరఖాస్తు చేసుకొనే వ్యక్తిగత పాలసీదారులు ఫారంలో బీమా-ఏఎస్‌బీఏ సదుపాయాన్ని ఎంచుకోవాలి.
- బీమా సంస్థ తమ భాగస్వామి బ్యాంక్ ద్వారా బీమా ప్రీమియం సొమ్మును ఖాతాలోనే నిలుపుదల చేయాలని పాలసీదారుని బ్యాంక్‌కు విజ్ఞప్తి చేస్తుంది.
- పాలసీదారుని అంగీకారంతో బీమా ప్రీమియం చెల్లింపునకు సరిపడా నగదును ఖాతాలోనే బ్యాంక్ ఆపేస్తుంది. ఈ సమాచారాన్ని బీమా సంస్థకూ బ్యాంక్ తెలియజేస్తుంది.
- ఖాతాలో నిలిచిపోయిన నగదుకు వడ్డీ ఆదాయం కూడా ఉంటుంది. కానీ బీమా సంస్థ తుది నిర్ణయం వచ్చేదాకా దాన్ని కస్టమర్లు తీసుకోలేరు.
- కస్టమర్ పాలసీని బీమా సంస్థ ఆమోదిస్తే.. అప్పుడు సదరు కంపెనీ విజ్ఞప్తి మేరకు ఖాతా నుంచి ప్రీమియం సొమ్మును బ్యాంక్ బదిలీ చేస్తుంది.
- బీమా పాలసీ తిరస్కరణకు గురైతే ఖాతాలో నిలిపిన నగదు మొత్తాలు పూర్తిగా ఖాతాదారునికి అందుబాటులోకి వస్తాయి.
- 14 రోజుల్లోగా బీమా దరఖాస్తు ప్రక్రియ పూర్తికాకపోతే బ్యాంకులు ఖాతాలోని సొమ్మును అన్‌బ్లాక్ చేసేస్తాయి. అప్పుడు ఖాతాదారుడు దాన్ని తన ఇతర అవసరాలకు వాడుకోవచ్చు.

# దేశీయ ఫార్మాకు కష్టకాలం!

**ట్రంప్ 25 శాతం సుంకం విధించనుండటంతో ఎగుమతులపై ప్రభావం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశీయ ఫార్మా రంగానికి కష్టకాలం మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఫార్మా సంస్థలపై పిడుగుపడినట్లు అయింది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే సెమికండక్టర్లు, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులపై 25 శాతం లేదా అంతకంటే ఎక్కువగా పన్ను వేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికా జనరిక్ ఔషధ మార్కెట్‌పై ఆధారపడివున్న దేశీయ ఫార్మా సంస్థలకు ఇది చేదువార్త. 2024లో భారత్ నుంచి అమెరికాకు 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి అయ్యాయి. మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా 31 శాతంగా ఉన్నది. ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో అక్కడి మార్కెట్లో విక్రయించనున్న జనరిక్ ఔషధ ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉన్నది. దీంతో అమెరికన్లు దేశీయ జనరిక్ ఔషధాల కొనుగోలు తగ్గించి, అక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశాలుంటాయని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. యూఎస్‌లో వినియోగిస్తున్న జనరిక్ ఔషధాల్లో సగం భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్నవే కావడం విశేషం. దీంతో ఏటా అమెరికా 408 బిలియన్ డాలర్ల ఆదా అవుతున్నది.

**కంపెనీలపై ప్రతికూల ప్రభావం..**

టారిఫ్‌ల దెబ్బతో సన్‌ఫార్మాస్యూటికల్స్, డాక్టర్ రెడ్డీస్, సిప్లా, బయోకాన్ వంటి సంస్థలు భారీగా నష్టపోనున్నాయి. 2024లో సన్‌ఫార్మాకు వచ్చిన మొత్తం ఆదాయంలో అమెరికా నుంచి 32 శాతం సమకూరింది. ఈ టారిఫ్‌లపై కంపెనీ ఎండీ దిలీప్ సంఘ్వీ మాట్లాడుతూ..అదనపు సుంకాలు విధించడంతో సంస్థపై పడనున్న భారాన్ని వినియోగదారులపై మోపనున్నట్లు చెప్పారు. ఫార్మా ఉత్పత్తుల ధరలు పెంచకతప్పదని ఆయన సంకేతాలిచ్చారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బ ఫార్మా సంస్థలతోపాటు కొనుగోలుదారులపై కూడా పడనున్నదన్నమాట. 100 దేశాలకు తన ఔషధాలను ఎగుమతి చేస్తున్న సంస్థకు వచ్చే మొత్తం ఆదాయంలో వీటి వాటా 72.7 శాతంగా ఉండటం విశేషం. అలాగే డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు వచ్చిన ఆదాయంలో 47 శాతం ఉత్తర అమెరికా నుంచి సమకూరుతున్నది. వీటిలో ఆంకాలజీ, ఇమ్యునాలజీ థెరపీకి సంబంధించిన జనరిక్ ఔషధాలు అత్యధికంగా అమ్ముడవుతున్నాయి. దేశంలో మూడో అతిపెద్ద ఔషధ సంస్థ సిప్లా ఆదాయంలో 30 శాతం ఉత్తర అమెరికా నుంచి సమకూరుతున్నది.



బుధవారం హైదరాబాద్‌లోని కాస్మోస్ సహకార బ్యాంక్ ఎంజీ రోడ్ శాఖ 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ ఉమేష్ బెల్లే, డీజీఎం జితేంద్ర అంబార్కర్, ఏజీఎం ఏ సందీప, చీఫ్ మేనేజర్లు వీ గౌతమ్ రాయ్, సీ రమేశ్, బ్రాంచ్ మేనేజర్ వీ సంధ్యా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

# మళ్లీ ఆల్‌టైమ్ హైకి బంగారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైకి చేరుకున్నాయి. బుధవారం ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ రూ.900 పుంజుకొని రూ.89,400లుగా నమోదైంది. తొలిసారి గత శుక్రవారం (ఫిబ్రవరి 14) ఇదే స్థాయికి ధరలు పెరిగిన విషయం తెలిసిందే. అయితే సోమవారం ఒక్కరోజే ఏకంగా రూ.1,200 పడిపోయింది. కానీ మంగళవారం రూ.300 పెరిగిన నేపథ్యంలో మళ్లీ రేటు రికార్డు గరిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడికి పెరిగిన డిమాండ్, భారతీయ విపణిలో హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల కొనుగోళ్లు ధరల్ని పరుగులు పెట్టించాయని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. కాగా, ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా తులం బంగారం ధర దేశీయ మార్కెట్‌లో రూ.10,010 పెరిగింది. జనవరి 1న రూ.79,390గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.700 ఎగబాకి రూ.87,650గా.. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.650 ఎగిసి రూ.80,350గా ఉన్నది.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ద్విచక్ర వాహనంతో చెట్టుకు ఢీ కొని ప్రమాదంలో గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావు తెలిపారు. నాందేడ్ జిల్లా యావత్మాల్ తాలూకా ఫోడ్ కుప్టికు చెందిన సెలర్ అంకుశ్ (20) ఈ నెల 3వ తేదీన అన్న అంత్యక్రియలకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో చెట్టుకు ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కోర్టాలో చికిత్స పొందిన అనంతరం ఈ నెల 7వ తేదీ రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఇక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. దీంతో టూ టౌన్ ఎస్ఐ ముకుంద్ రావ్ జీరో ఎఫైర్ నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## గుడుంబా పట్టివేత

దస్తురాబాద్, ఫిబ్రవరి 19 : దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట గ్రామంలో రాంటేకి మహేందర్ ఇంటి వద్ద అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. రాంటేకి మహేందర్ వద్ద 10 లీటర్ల గుడుంబాను సాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

## విద్యుత్ తీగలు తగిలి మహారాష్ట్ర వాసి మృతి

సోన్, ఫిబ్రవరి 19 : నిర్మల్ జిల్లా సోన్ మండలం మాదాపూర్ గ్రామంలో పసుపు లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైరు తగిలి మహారాష్ట్ర వాసి మృతి చెందినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా వలగ్ గ్రామానికి చెందిన మోరే చంద్రకాంత్ (24) మంగళవారం సాయంత్రం ఐచర్ వాహనంలో పసుపును లోడ్ చేస్తుండగా 11కేవీ విద్యుత్ వైరు తగలడంతో గాయాలయ్యాయి. వెంటనే ఆయనను నిర్మల్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కారు, ద్విచక్రవాహనం ఢీ: యువకుడికి గాయాలు

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 19: లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ లో బుధవారం కారు, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో నర్సాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కనకాపూర్‌లోని పెట్రోల్‌బంకు సమీపంలో నిర్మల్ వైపు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## అడవి పంది దాడిలో రైతుకు..

నార్నూర్, ఫిబ్రవరి 19 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం లొద్దిగూడ గ్రామానికి చెందిన కొడప జంగు అనే రైతు వ్యవసాయ పనులకు బుధవారం వెళ్లాడు. రైతు పొలం పత్తి కట్టే తీస్తున్నాడు. ఆకస్మాతుగా వెనుక నుంచి అతనిపై అడవి పంది దాడి చేయడంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల రైతులు ఘటన స్థలానికి కేకలు వేస్తూ చేరగా అడవి పంది పారిపోయింది. అప్పటికే కొడప జంగు తీవ్ర గాయాలతో పడ్డి ఉన్నాడు. కుటుంబ సభ్యులు తక్షణమే ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. అడవి పంది దాడిలో గాయపడిన రైతును అటవీ శాఖ అధికారులు ఆదుకోవాలని స్థానికులు, కుటుంబీకులు కోరుతున్నారు.

## ఇద్దరు మహిళలపై కేసు

ముథోల్, ఫిబ్రవరి, 19 : నిర్మల్ జిల్లా ముథోల్‌లోని బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సులో దొంగతనానికి ప్రయత్నించిన షబనా, పద్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆష్టా గ్రామానికి చెందిన సునీత పిల్లలతో నిజామాబాద్ వెళ్లడానికి ముథోల్‌లో బస్టాండ్‌లో బస్సులో ఎక్కి పిల్లలను కూర్చోబెట్టి వాటర్ బాటిల్ కొనుక్కోవడానికి కిందికి దిగింది. వెంబడే ఆమె సెల్‌ఫోన్, పర్సు పోవడంతో ఆమె దొంగతనం జరిగినట్లు గ్రహించారు. దీంతో బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీసులు తనిఖీలు చేయగా వీరి వద్ద దొరికాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# అంగన్‌వాడీల ఉన్నతీకరణకు చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 19 : అంగన్‌వాడీల ఉన్నతీకరణకు చర్యలు తీసుకుంటున్నామని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. అంగన్‌వాడీల అభివృద్ధి, ఉన్నతీకరణ, తదితర అంశాలపై సంక్షేమ శాఖ జేడీ బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అంగన్‌వాడీలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రతి కేంద్రంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో సీడీపీవో నాగలక్ష్మి, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.



నిర్మల్ చైన్‌గేట్: మాట్లాడుతున్న నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## అనుమతులు లేకుంటే కఠిన చర్యలు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 19 : అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం నిర్మల్‌లోని వాటర్‌ప్లాంట్‌లను ఆయన తనిఖీ చేశారు. వాటర్ ప్లాంట్‌లలో నిర్వహిస్తున్న నీటి శుద్ధీకరణను అధికారులతో కలిసి పరిశీలించారు. నిబంధనలకు లోబడి నీటిని ప్యూరిఫై చేయాలని, ప్రభుత్వ అనుమతులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్లాంట్లలో పరిశుభ్రత పాటించాలని ఎప్పటికప్పుడు క్యాన్లు, ట్యాంకులను శుద్ధి చేయాలన్నారు.

## పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 19 : పన్నుల వసూలు వందశాతం పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్‌లోని వివిధ కాలనీల్లో చేపడుతున్న పన్నుల వసూలు, వాణిజ్య లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియను మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆస్తి పన్నుతో పాటు అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లించాలని వ్యాపారస్తులకు సూచించారు. నిర్ణీత గడువులోగా వాణిజ్య లైసెన్సులను పునరుద్దరించుకోవాలన్నారు. సకాలంలో చెల్లించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈ హరిభువన్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## రైతులను ప్రలోభాలకు గురి చేస్తే చర్యలు

ఖానాపూర్, ఫిబ్రవరి 19 : రైతులను ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని నాణ్యత లేని మందులను అంటగట్టేందుకు ప్రలోబలకు గురి చేస్తే ఫర్టిలైజర్ యాజమానులపై కఠిన చర్యలు తప్పవని ఖానాపూర్ వ్యవసాయ శాఖ అధికారి జగదీశ్వర్ హెచ్చరించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని మన గ్రోమోర్ సెంటర్‌లో రెండు రోజులుగా యురియా కోసం వచ్చిన రైతులకు ఇతర పిచికారీ మందులు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో నిర్వాహకులపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఏవో జగదీశ్వర్ బుధవారం మన గ్రోమోర్ సెంటర్‌తో పాటు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకు పంట దిగుబడులకు కావాల్సిన పిచికారీ మందులు, ఎరువులు మాత్రమే రైతులకు ఇవ్వాలని యాజమానులకు సూచించారు. అధిక ధరలతో కూడిన ఎరువులను విక్రయించి రైతులను నష్టపరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. అనంతరం షాపుల్లో స్టాక్ రిజిష్టర్, బోర్డు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 19: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడ(జీ) గ్రామానికి చెందిన ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాలు..మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది కారం రాజేశ్వర్, కృష్ణ, దీప తెలిపిన వివరాల ప్రకారం...కేస్లాగూడ(జీ) గ్రామానికి చెందిన మడావి రాంషావ్ ముత్నూర్‌లోని వారసంతకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా ఉట్నూర్ మండలంలోని బోయవాడకు చెందిన శ్రీను, నాగన్నలు కలిసి బైక్‌పై ఉట్నూర్ వైపు నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుంగా ఢీ కొనడంతో కేస్లాగూడ(జీ)గ్రామానికి చెందిన మడావి రాంషావ్‌తో పాటు తన కుమారుడు మడావి బళ్లుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి 108 అంబులెన్స్ ద్వారా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. మడావి రాంషావ్ ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉండడంతో రిమ్స్ వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇంజినీరింగ్ బానోత్ హరిసింగ్

## ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం తనిఖీ

ఎదులాపురం, ఫిబ్రవరి 19: డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, శ్రోతలకు నాణ్యమైన ప్రసారాలను అందిస్తున్న ఆకాశవాణి ఆదిలాబాద్ సిబ్బంది కృషి అభినందనీయమని ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇంజినీరింగ్ బానోత్ హరిసింగ్ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి రాబోయే రోజుల్లో ఈ కేంద్రం పేరును నిలపాలని అన్నారు. సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని ట్రాన్స్ మీటర్, 100 మీటర్ల టవర్, స్టూడియో, ట్రాన్స్ మిషన్ బూత్, డీజీ రూం తదితర విభాగాలను ఆయన పరిశీలించారు. ట్రాన్స్ మిషన్ పని తీరును, డిజిటలైజ్డ్ కన్సోల్ పని తీరును ఇక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం కార్యక్రమ, ఇంజినీరింగ్ సిబ్బందితో సమావేశమై పలు విషయాలను చర్చించారు. గతంలో ఇక్కడ పని చేసిన అధికారులకు మంచి పేరు ఉందని, అలాగే ఈ కేంద్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందని డిప్యూటీ డైరెక్టర్ బానోత్ హరి సింగ్ అన్నారు. ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. సిబ్బంది పని తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కేంద్రం అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట హైదరాబాద్ నుంచి వచ్చిన ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్ ఇంజినీరింగ్ లక్కోజు శ్రీనివాస్, ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ముఖ్య కార్యక్రమ అధికారి రామేశ్వర్ కేంద్రె, వెంకటేశులు, ఇంజిరింగ్ సిబ్బంది పోతురాజు, శశికాంత్, గిరీశ్ కుమార్, వెంకటయ్య, విజయకుమారి ఉన్నారు.



సాత్నాల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా

జైనథ్, ఫిబ్రవరి 19: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం జైనథ్, భోరజ్, సాత్నాల తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు లంక రాఘవులు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలకు హామీ కల్పించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాలకు 50 శాతం నిధులు పెంచాలని ఆరోగ్య, విద్యా రంగాలకు జీడీపీ 3 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లకు సంబంధించిన వినతి పత్రాలను జైనథ్ తహసీల్దార్ ఆత్రం నారాయణ, భోరజ్ తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, సాత్నాల తహసీల్దార్ విశ్వనాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం గంగన్న, అరవింద్, వెంకటేశ్, కిష్టు, రవి, ఆశన్న, గంగారాం, పొచ్చక్క, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేల, ఫిబ్రవరి 19 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 -26 బడ్జెట్‌లో పేదలకు కార్మికులకు తీవ్ర నష్టం చేశారని, కేవలం ధనికుల కోసమే బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని సీపీఐఎం జిల్లా సభ్యుడు కిష్టు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రఘునాథ్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ మండల నాయకులు లక్ష్మి, బాబురావ్, తానుజీ, ధర్ము, ఎం.రాందాస్ పాల్గొన్నారు.

## భార్యపై హత్యాయత్నం చేసిన భర్త రిమాండ్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 19: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో మంగళవారం భార్య గుట్టె సంజీవణితో పాటు అత్త కేంద్రే అనిత, అమ్మమ్మ హోలంబే రాధాబాయిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన భర్త గుట్టే అంకుశ్‌ను బుధవారం పోలీసులు అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ధనోరా(బీ) గ్రామానికి చెందిన గుట్టె అంకుశ్ మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో తన తల్లిగారి ఇంట్లో ఉంటున్న భార్య సంజీవణితో పాటు అత్త కేంద్రే అనిత, అమ్మమ్మ హోలంబే రాధాబాయిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చి హత్యా చేసేందుకు ప్రయత్నించాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి జిల్లా కేంద్రంలోని జైలులో రిమాండ్ చేసినట్లు తెలిపారు.

## ఉపకార వేతనాల మంజూరు కోసం

# దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో 2024-25 విద్య సంవత్సరానికి 9,10వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలు మంజూరు కోసం దరఖాస్తు కోసం ఈ పాస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉపకార వేతనాల ప్రతిపాదనలు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లా కార్యాలయనికి సంబంధిత ధృవీకరణ పత్రాలను జతపరచి మార్చి 31వ తేదీ లోగా అందజేయలన్నారు. ఉపకార వేతనాల మంజూరు కోసం విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల మించకూడదన్నారు. కులం, నివాస, ఆదాయ, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు సంబంధిత తహసీల్దార్‌చే జారీ చేయబడి ఉండలన్నారు. సంబంధిత ఎస్సీ విద్యార్థి బ్యాంక్ ఖాతా ఆధార్‌తో అనుసంధానమై ఉండాలన్నారు. అర్హత గల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3,500 చొప్పున మంజూరు చేయబడుతుందని పేర్కొన్నారు.